సాక్షి
వికారాబాద్
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



హక్కులు సాధించేవరకు..

ఆశ వర్కర్లు శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని అణచివేయడం తగదని జీఆర్‌టీయూ నాయకులు అన్నారు. 10లో▸



అందుబాటులో వైద్యం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. 10లో▸



నాలుగు నెలలుగా వెతలు


గ్రామ పంచాయతీ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. 11లో▸

తేరుకోని లగచర్ల!

లగచర్ల ఘటన జరిగి నెల రోజులు పూర్తయినా.. బాధిత గ్రామాల్లో ఉత్కంఠ వాతావరణమే కొనసాగుతోంది. జైలుకు వెళ్లిన వారికి బెయిల్ దొరకక.. పరారీలో ఉన్న వారి కోసం పోలీసుల గాలింపుతో గిరిజనులు సతమతమవుతున్నారు. ఆ రోజు నుంచి కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నామని వాపోతున్నారు.

అధికారులపై దాడి ఘటనకు నేటితో నెల రోజులు

- బెయిల్ దొరకక జైళ్లలోనే మగ్గుతున్న నిందితులు
- మిగిలిన వారికోసం పోలీసుల గాలింపు
- కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్న వృద్ధులు, మహిళలు


లగచర్ల గ్రామ ముఖచిత్రం

దుద్యాల్: వికారాబాద్ జిల్లాలోని ఓ మారుమూలన ఏర్పడిన కొత్త మండలం దుద్యాల్. సరిగ్గా నెల రోజుల క్రితం వరకు కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు మినహా ఎవరికీ తెలియని ప్రాంతం. ఇదంతా గత నెల 10వ తేదీ వరకు మాత్రమే. 2024 నవంబర్ 11న లగచర్ల ఘటన జరిగిన అనంతరం దుద్యాల మండలం పేరు రాష్ట్ర, దేశస్థాయిలో మార్మోగింది. అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు, ఢిల్లీ స్థాయి అధికారులు, నేతలను తనవైపు తిప్పుకొంది.

ఫార్మా ఉత్తర్వులతో మొదలు..

తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ ప్రాంతంలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. ఇందుకోసం దుద్యాల్ మండలాన్ని ఎంచుకున్నారు. ఫార్మా సిటీ కోసం అవసరమైన భూ సేకరణ కోసం ఉన్నతాధికారులను పురమాయించారు. దీంతో మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండతండా, పులిచర్లకుంటతండాల్లోని 1,276 ఎకరాల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు, ధర్నాలతో తమ నిరసన తెలియజేశారు. అయినప్పటికీ వెనక్కి తగ్గని ప్రభుత్వం గత నవంబర్ 11న లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేసింది. తమ గోడు పట్టించుకోకుండా, ఆరోగ్యాలను దెబ్బతీసే ఫార్మా ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఆగ్రహించిన రైతులు.. సభకు హాజరైన కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేక అధికారిపై దాడి చేశారు. ఈక్షణం నుంచి సుమారు 15రోజుల పాటు ఏ టీవీలో చూసినా.. ఏ దినపత్రికలో చూసినా దుద్యాల మండలం పేరు ప్రధాన అంశంగా కనిపించింది. సామాజిక మాధ్యమాల్లో సైతం ఇందుకు సంబంధించిన వీడియోలు, మెస్సేజ్‌లు జోరుగా చక్కర్లు కొట్టాయి. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో రైతులు.. అధికారులపై దాడి చేశారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.

ఢిల్లీకి చేరిన బాధితులు..

అధికారులపై దాడి జరిగిన రోజు అర్ధరాత్రి లగచర్ల, పులిచర్లకుంటతండా, రోటిబండతండాలను చుట్టుముట్టిన పోలీసులు దొరికిన వారిని దొరికినట్టు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనలో పాల్గొన్న సుమారు 75 మందిని గుర్తించి, కేసులు నమోదు చేశారు. అనంతరం నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసి దొరికిన వాళ్లందరినీ జైలుకు పంపించారు. ఇందులో దాడికి సంబంధం లేని వారిని సైతం అక్రమంగా అరెస్టు చేశారని, పోలీసులు ఇళ్లలో జొరబడి అమానుషంగా ప్రవర్తించారని పలువురు మహిళలు, బాధితులు జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లలో ఫిర్యాదు చేశారు. ప్రతిపక్ష పార్టీలు బాధితులకు మద్దతుగా నిలవడంతో దాడి ఘటన విస్తృతంగా ప్రచారమైంది. ఢిల్లీ నుంచి ఎన్‌హెచ్‌ఆర్సీ బృందంతో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్ రావడం, బాధిత గ్రామాల్లో సమావేశాలు నిర్వహించడంతో లగచర్ల ఘటన హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని ఏ–1 నిందితుడిగా చేర్చడం, కేసులో అరెస్టయినవారిలో ఇప్పటికీ ఒక్కరు కూడా విడుదల కాకపోడంతో టెన్షన్ అలాగే కొనసాగుతోంది.

భయం వీడని గ్రామాలు

ఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా ఆయా గ్రామాల ప్రజలను భయం వీడలేదు. ఈ ఘటనలో కేసులు నమోదైన వారి ఆచూకీ కోసం పోలీసులు ఇప్పటికీ వెతుకుతున్నారు. దీంతో ఇంటికి వస్తే ఎక్కడ దొరికిపోతామో అనే భయంతో చాలా మంది ఊరికి దూరంగా తల దాచుకుంటున్నారు. తండాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పురుషులెవరూ ఇంటి వద్ద లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

ఎట్టకేలకు రద్దు ప్రకటన

ప్రతిపక్షాలు, మానవ హక్కుల సంఘాలు, ప్రజల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో ఫార్మా ఏర్పాటును విరమించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీని స్థానంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తామని పేర్కొంది. పరిహారం పెంచుతామని, ఆయా కంపెనీల్లోని ఉద్యోగ నియామకాల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించింది. దీంతో బాధితులు కొంత ఊపిరి పీల్చుకున్నారు.

కేసులు ఎత్తివేయాలి

అక్రమంగా కేసులు పెట్టి గిరిజనులను చిత్ర హింసలకు గురి చేస్తున్నారని గిరిజన తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమవారిపై పెట్టిన కేసులు ఎత్తివేసి, వెంటనే వదిలేయాలని డిమాండ్‌చేస్తున్నారు. ప్రభుత్వం తమపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు.

న్యూస్‌రీల్

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

మెప్మా పీడీ రవికుమార్


మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశమైన మెప్మా పీడీ రవికుమార్

పరిగి: మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ రవికుమార్ సూచించారు. మంగళవార పరిగి పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో పట్టణ మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, టీఎంసీ వెంకటేష్,, సీఈఓ భాగ్యలక్ష్మి, మహిళా సంఘం అధ్యక్షురాలు నర్సమ్మ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- అడిషనల్ డీఎంహెచ్‌ఓ జీవరాజు
- దోమ ఆస్పత్రిలో తనిఖీలు


వైద్యురాలు రజితతో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ జీవరాజు

దోమ: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అడిషనల్ డీఎంహెచ్‌ఓ జీవరాజు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఆయన సిబ్బంది, మందుల వివరాలను డాక్టర్ రజితను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 8న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆస్పత్రిని సందర్శించగా సిబ్బంది లేకపోవడంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఏఎన్‌ఎంలు వనలత, స్వప్న, అటెండర్ వెంకటయ్య, రామాంజనేయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో మెమోలు జారీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి


మాట్లాడుతున్న న్యాయమూర్తి డీబీ శీతల్

అనంతగిరి: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని న్యాయసేవాధికారి సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని భృంగీ స్కూల్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, మాజీ మంత్రి డాక్టర్. చంద్రశేఖర్, లీగల్‌చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్, శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది మాధవరెడ్డి, కొడంగల్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ, స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పాంబండ’ ఆలయ చైర్మన్‌గా మైపాల్‌రెడ్డి



కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర దేవస్థానం చైర్మన్‌గా మండలంలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన మైపాల్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర దేవాదాయా ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.


గ్రూప్ -2 పరీక్షలపై దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

గ్రూప్–2కు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: గ్రూప్ – 2 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న గ్రూప్ – 2 పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాలో గ్రూప్–2 పరీక్షల కోసం 30 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వికారాబాద్ మండలంలో 14, పూడూరు మండలం 1, పరిగి మండలంలో 4, తాండూరు మండలంలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మొత్తం 10,381 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించుకోవాలని సూచించారు. పోలీసుల భద్రత మధ్య ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. 15వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30గంటల వరకు, 16న తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు వసతులు కల్పించాలని సూచించారు. విద్యుత్ సదుపాయం ఉండేలా చూసుకోవాలన్నారు. తాగునీరు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు అభ్యర్థులు వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ టీవీ హనుమంత రావు, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, పబ్లిక్ సర్వీస్ కమిషన్ రీజినల్ కోఆర్డినేటర్లు నరేంద్రకుమార్, అరవింద్‌రెడ్డి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ హాలీ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన అధికారులు

ప్రజావాణి రద్దు

సోమవారం గ్రూప్ –2 పరీక్షలు ఉన్నందున అధికారులు పరీక్ష విధుల్లో ఉంటారని.. ఈ కారణంగా 16వ తేదీ సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు.

15న మంత్రుల పర్యటన

కుల్కచర్ల: మండలంలో ఈ నెల 15న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవాదాయశాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15న పాంబండ రామలింగేశ్వర దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం ఉంటుందని, ముఖ్యఅతిథులుగా మంత్రులు హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, మాజీ ఎంపీపీ అంజిలయ్య గౌడ్, నాయకులు వెంకటయ్య, గోవర్దన్ రెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, మొగులయ్య, రాము, జలీల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

4,982 పోలింగ్ కేంద్రాల గుర్తింపు

అనంతగిరి: గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం జిల్లా వ్యాప్తంగా 4,982 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు.. 4,982 వార్డులు ఉన్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో పోలింగ్ కేంద్రాన్ని గుర్తించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ నెల 12న ఎంపీడీఓల ఆధ్వర్యంలో మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీఐ కర్మాగారాన్ని ఆధునీకరించాలి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- కేంద్ర మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేత

తాండూరు: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సీసీఐ సిమెంట్ కర్మాగారాన్ని ఆధునీకరించి ఉత్పత్తి సామర్థ్యాలను పెంచాలని చెవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి విన్నవించారు. మంగళవారం ఢిల్లీలో ఆయన్ను కలిసి పరిశ్రమలో నెలకొన్న సమస్యలను వివరించారు. కొన్నాళ్లుగా ఉత్పత్తి భారీగా తగ్గిపోయిందన్నారు. కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పరిశ్రమను ఆధునీకరించేందుకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే తాండూరు నియోజకవర్గం కర్ణాటక సరిహద్దు కురుగుంట గ్రామంలో ఉన్న సీసీఐ కార్మాగారంలో మూడు దశాబ్దాలుగా ఉత్పత్తి ఆగిపోయిందని, పరిశ్రమను ఆధునీకరిస్తే ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని తెలిపారు. స్పందించిన కేంద్రమంత్రి సీసీఐ పరిశ్రమలను ఆధునీకరించేందుకు కృషి చేస్తానని ఎంపీకి హామీ ఇచ్చారు.

ధాన్యం సేకరణ సజావుగా సాగాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి


ఏఈఓలకు సూచనలందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

కొడంగల్ రూరల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ సజావుగా సాగేలా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని పర్సాపూర్ రైతువేదికలో ఏఈఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ఇస్సాక్ హెరాల్డ్, శ్రీపతిరెడ్డి, సుమ, పావని, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మాలల ఉప కులాలను చేర్చొద్దు

ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకుల వినతి



అనంతగిరి: ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు రంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చిన ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్, తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్‌ను మంగళవారం వికారాబాద్ జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు కలిశారు. మాలల ఉప కులాలను మాదిగ గ్రూపుల్లో చేర్చరాదని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ.. మాలలలో ఉన్నటువంటి ఉప కులాలను మాదిగ గ్రూపుల్లో ఎట్టి పరిస్థితుల్లో చేర్చరాదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను సత్వరమే పరిష్కరించి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా ముఖ్య నాయకులు స్వామిదాస్, ప్రకాష్, సుభాష్, మహేందర్, నర్సింలు, జగదీష్, అనంతయ్య పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులకు అస్వస్థత

- వాంతులతో ఆస్పత్రి పాలైన 15మంది బాలికలు
- గిరిజన గురుకులాన్ని సందర్శించిన తహసీల్దార్ తారాసింగ్


తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

తాండూరు టౌన్: ఫుడ్ పాయిజన్ కావడంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన తాండూరు పట్టణం సాయిపూర్‌లోని గిరిజన బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహంలో మంగళవారం చోటుచేసుకుంది. ఉదయం కిచిడీ తిన్న తర్వాత సుమారు 15 మంది విద్యార్థినులు కడుపు నొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకున్నారు. హుటాహుటిన పాఠశాల ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నలుగురు బాలికలకు తీవ్ర నొప్పి ఉండటంతో వారిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. మిగిలిన వారికి ప్రథమ చికిత్స చేసి హాస్టల్‌కు పంపారు. సాయంత్రం మరికొంత మంది బాలికలు అస్వస్థతకు గురి కావడంతో వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ తారాసింగ్, కౌన్సిలర్లు రత్నమాల, నీరజా బాల్‌రెడ్డి, లలిత, సాహు శ్రీలత వసతి గృహానికి చేరుకొని పరిస్థితులపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. రోజూ అన్నంలో పురుగులు వస్తున్నాయని, వంటవారికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. నిత్యం పాత్రలు కడగడం, వంటగది శుభ్రం చేయడం, కూరగాయలు కోయడం వంటి పనులు తమతో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు చేయకపోతే వంట మనుషులు తిడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదన్నారు. ఫుడ్ పాయిజన్ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వకుమారిని వివరణ కోరగా ఆమె సమాధానం చెప్పేందుకు నిరాకరించారు. చికిత్స పొందుతున్న బాలికల పరిస్థితి మెరుగ్గా ఉందని ఆర్డీఓ వాసుచంద్ర తెలిపారు. పిల్లలు తిన్న కిచిడీ శాంపిల్‌ను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి జగన్నాథ్ సేకరించారని తెలిపారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కమలాకర్ రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్, పీఓ నిరోష విద్యార్థులతో మాట్లాడామని, తల్లిదండ్రులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.

బాధాకరం: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: పట్టణంలోని గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకోవడం బాధాకరమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ, వైద్యశాఖ అధికారులను హాస్టల్‌కు పంపినట్లు తెలిపారు. విద్యార్థినులను జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించినట్లు చెప్పారు. ఘటనపై విచారణ చేయాలని జిల్లా అధికారులను కోరినట్లు తెలిపారు. సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తెలితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రభుత్వ తీరు దారుణం: బీజేపీ

వసతి గృహాలు, గురుకులాల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని బీజేపీ నాయకులు లలిత, సాహు శ్రీలత, నాగారం మల్లేశం అన్నారు. వాంతులు చేసుకుంటున్న బాలికలను దగ్గరుండి ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై బీఆర్‌ఎస్ నాయకుడు శుభ్రప్రద్ పటేల్ మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం: రోహిత్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. అస్వస్థతకు గురైన బాలికలకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

అన్నం తినలేకపోతున్నాం



ఉడికీ ఉడకని అన్నం పెట్టి తినమంటే ఎలా? భోజనం అసలు బాగుండటం లేదు. వంటవాళ్లు మాతోనే అన్ని పనులు చేయిస్తుంటారు. హాస్టల్‌కు లెచ్చిన కూరగాయలను ఇంటికి తీసుకెళ్తున్నారు. ఇక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి.

– రోషిణి, వసతి గృహ విద్యార్థిని

మా పరిస్థితి బాగా లేదు



మేము తినే అన్నం అసలు బాగుండదు. వంట వాళ్లను అడిగితే బూతులు తిడుతున్నారు. పీకల దాకా మెక్కింది సరిపోలేదా అంటూ దబాయిస్తున్నారు. ఇంట్లో వాళ్ల పిల్లలకు ఇలాంటి అన్నం పెడతారా? మా పరిస్థితి ఏమాత్రం మంచిగా లేదు.

– లీలావతి, విద్యార్థిని

క్లుప్తంగా

పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దౌల్తాబాద్: టీబీ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పలువురికి టీబీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 120మంది రోగులను పరీక్షించగా పది మందికి టీబీ ఉన్నట్లు గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. దగ్గు, జ్వరం, జలుబు ఉన్న వారు డాక్టర్‌ను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సలహాలు పాటిస్తే నయం అవుతందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వందన, అమూల్య, సౌమ్య టెక్నీషియన్ సాయిశంకర్‌రెడ్డి, ఎస్‌టీఎస్ రాహత్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

యాలాల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన బోధించేందుకు గెస్ట్ టీచర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మంగమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో బోధించడానికి బీఎస్సీ నర్సింగ్ చేసిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ధృవపత్రాలతో ఈ నెల 13న సాయంత్రం 4 గంటల లోపు కేజీబీవీలో సంప్రదించాలన్నారు.

ఇండోర్ స్టేడియం రెడీ

త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధమైన ఇండోర్ స్టేడియం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం శివారులోని గుట్ట వద్ద ఇండోర్ స్టేడియం ప్రారంభానికి ముస్తాబైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూర్బన్ పథకం కింద 2021లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నిధులు లేక పనులు మధ్యలో నిలిచిపోయాయి. తాజాగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులు పూర్తి చేశారు. త్వరలోనే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఈడబ్ల్యూఐడీసీ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

ముగ్గురు కానిస్టేబుళ్లకు పదోన్నతి

యాలాల: యాలాల ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లకు పదోన్నతి లభించింది. బాల్‌రాజ్‌గౌడ్, రఫీక్, హన్మంత్ కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం వీరు వరంగల్ జిల్లాలో 42 రోజుల పాటు నిర్వహించే ఇన్‌సర్వీస్ ట్రైనింగ్‌కు వెళ్లారు. శిక్షణ అనంతరం ఠాణాలో విధుల్లో చేరుతారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

పరిగి: బైక్‌పై నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నిదురం లక్ష్మి(38), రాములు దంపతులు ఈనెల 9న(సోమవారం) తాము సాగు చేసిన పాలకూరను విక్రయించేందుకు పరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో నారాయణపూర్ వాగులో ప్రమాదవశాత్తు లక్ష్మి జారిపడింది. దీంతో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని చెప్పారు. మృతురాలి తమ్ముడు బాలయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్



ఘటనా స్థలిలో మహ్మద్ ఇమ్రాన్ మృతదేహం

సెంట్రింగ్ కార్మికుడి దుర్మరణం



నుజ్జునుజ్జయిన బైక్



ఇమ్రాన్ (ఫైల్)

చేవెళ్ల: ప్రైవేట్ స్కూల్ బస్ ఓ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ సెంట్రింగ్ కార్మికుడు ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్కేపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఊరేళ్ల అనుబంధ గ్రామమైన మొండివాగుకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్(22) సెంట్రింగ్ కార్మికుడు. పని నిమిత్తం ఉదయం 7గంటల ప్రాంతంలో తన బైక్‌పై ఎన్కేపల్లివైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చేవెళ్లలోని శ్రీసత్యసాయి గ్రామర్ హైస్కూల్‌కు చెందిన బస్ గ్రామాల్లో విద్యార్థులను తీసుకువచ్చేందుకు వెళ్తోంది. మార్గ మధ్యలో ఎన్కేపల్లికి సమీపంలో స్కూల్ బస్సు, బైక్ రెండు ఎదురెదురుగా వేగంగావచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఇమ్రాన్ బైక్‌పై నుంచి ఎగిరి పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నయీం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఆరు నెలల క్రితమే వివాహమైంది. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

మహిళ గొంతు కోసి హత్యాయత్నం

- తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలోకి వెళ్లి బాధితురాలు
- గాంధీ ఆస్పత్రికి తరలింపు
- చన్గోముల్ పీఎస్‌లో కేసు నమోదు

పూడూరు: గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని కాటేదాన్ ప్రాంతానికి చెందిన బీబీఫాతిమాకు పని ఇప్పిస్తామని చెప్పిన ఇద్దరు వ్యక్తులు ఆమెను వికారాబాద్ తీసుకువచ్చి ఈ దురాఘతానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు సమాచారం అందించడంతో



గాయపడిన ఫాతిమా

అక్కడికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గొంతుభాగం లోపలికి కోసుకుపోవడంతో ఆమెకు మాట్లాడరాలేదు. తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు స్పృహలోకి వస్తేనే.. ఆమెపై హత్యాయత్నానికి పాల్పడింది ఎవరు..? కుటుంబ తగాదాలు ఏవైనా ఉన్నాయా..? అనే పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



సబ్-కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు, విద్యార్థులు

బీసీ సంఘం ఆధ్వర్యంలో సబ్-కలెక్టరేట్ ముట్టడి

తాండూరు టౌన్: పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మంగళవారం సబ్-కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుతున్న విద్యార్థులకు బకాయిలు తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నాయన్నారు. విద్యార్థులకు రావాల్సిన బకాయిలను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టి ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ముట్టడిలో బీసీ సంఘం నాయకులు సయ్యద్ షకూర్, వెంకటేశ్, నరేందర్, శ్రావణ్, బసంత్, రామకృష్ణ, అనిత, నర్సమ్మ, విజయలక్ష్మి, మంజుల, బస్వరాజ్, రాము, శివ, రమేశ్, నరేశ్, రాజు, సోను పలు కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక.. హైదరాబాద్‌లో ప్రత్యక్షం

- 18 రోజుల తర్వాత స్వాతి ఆచూకీ లభ్యం
- సఖి సెంటర్‌కు తరలించిన కరన్‌కోట్ పోలీసులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్‌కు బాలిక స్వాతి కనిపించకుండా పోయిన విషయం విదితమే. అమ్మమ్మ లాలమ్మ సంరక్షణలో ఉన్న బాలిక నవంబర్ 22న అదృశ్యమవడం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు 18 రోజుల తర్వాత బాలిక ఆచూకీ కనిపెట్టారు. హైదరాబాద్‌లోని సూరారం పోలీసులు గుర్తించి కరన్‌కోట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కరన్‌కోట్ ఠాణా సిబ్బంది నగరానికి వెళ్లి బాలికను వికారాబాద్ సఖి సెంటర్‌కు తరలించారు. సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటేశ్వర్లు స్వాతితో మాట్లాడారు. బుధవారం బాలిక కుటుంబ సభ్యులతో పాటు పోలీసులతో మాట్లాడుతామన్నారు. బాలికను లాలమ్మ పోషించే స్థితిలో ఉందాలేదా క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది పరిశీలిస్తారని.. లేదంటే సీడబ్ల్యూసీ ఆధీనంలో ఉన్న పరిగి బాల సదనం వసతి గృహంలో ఆశ్రయమిచ్చి చదివిస్తామన్నారు. కాగా బాలిక హైదరాబాద్‌కు ఎలా వెళ్లింది..? ఇన్ని రోజులు ఎక్కడ ఉంది? స్వాతితో మాట్లాడిన తర్వాత వెల్లడిస్తామన్నారు.



స్వాతిని వికారాబాద్ సఖి సెంటర్‌లో అప్పగిస్తున్న కరన్‌కోట్ పోలీసులు

హక్కులు సాధించే వరకు పోరాడుతాం



వికారాబాద్ పోలీసుల అదుపులో ఆశ వర్కర్లు

బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ

అనంతగిరి: ఆశ వర్కర్లు శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని అణచివేయడం తగదని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి కోటపల్లి అనిత అన్నారు. మంగళవారం బీఆర్టీయూ అనుబంధ సంఘమైన ఆశ వర్కర్ యూనియన్ నాయకులను తెల్లవారుజామునుంచే అక్రమంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసినా మా హక్కులు సాధించేవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్ల పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు జాబ్ మేళా

అనంతగిరి: జొమాటోలో ఉద్యోగాల భర్తీకి గురువారం వికారాబాద్‌లోని ఐటీఐ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అర్ధరాత్రి నర్సింగ్ హాస్టల్‌కు అగంతకుడు

- భయభ్రాంతులకు గురైన విద్యార్థినులు
- పోలీసులకు అప్పగించిన కళాశాల సిబ్బంది

తాండూరు టౌన్: అర్ధరాత్రి నర్సింగ్ హాస్టల్‌లోకి ఓ అంగంతకుడు దూరి హల్‌చల్ చేశాడు. గేటు, తలుపు గడియ పగులగొట్టుకుని విద్యార్థినుల గదిలోకి దూరడంతో వారు భయంతో కేకలు పెట్టారు. పట్టణంలోని పీపీ యూనిట్‌లోని బాలికల హాస్టల్‌లోకి సోమవారం అర్ధరాత్రి ఓ అగంతకుడు దూరాడు. దీంతో ఆందోళన చెందిన విద్యార్థులు కళాశాల సిబ్బంది ఆకాశ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన మరికొంత మందితో కలిసి అక్కడకు చేరుకుని అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. అగంతుడు రాగానే పోలీసులకు ఫోన్‌చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై పోలీసులను వివరణ కోరగా.. హాస్టల్‌లో దూరిన వ్యక్తికి మతిస్థిమితం సరిగా లేదని సీఐ సంతోశ్‌కుమార్ చెప్పారు. పాత తాండూరుకు చెందిన ఇమాంసాబ్‌గా గుర్తించామన్నారు. కళాశాల పిన్సిపాల్ విజయారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



హాస్టల్‌లో దూరిన ఇమాంసాబ్

శుభకార్యానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

షాద్‌నగర్‌రూరల్: శుభకార్యానికి వెళ్లి వస్తుండగా వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన షాద్‌నగర్ ఠాణా పరిధిలో మంగళవారం వెలుగు జూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన మరికంటి సాయికుమార్, భార్గవి దంపతులు నగరంలోని బేగంపేట పరిధి ప్రకాశ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. సాయికుమార్ బైక్‌మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 6న సాయికుమార్ దంపతులు వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని కాళ్లాపూర్‌లో బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. 7న హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న క్రమంలో షాద్‌నగర్‌లోని కేశంపేట రోడ్డులో ఉంటున్న బంధువు వెంకటేశ్‌తో ప్లాట్ విషయం మాట్లాడి వస్తానని భార్యను హైదరాబాద్‌కు వెళ్లమన్నాడు. దీంతో భార్గవి ప్రకాశ్‌నగర్‌కు వెళ్లిపోయింది. సాయికుమార్ ఇంటికి రాకపోవడంతో ఆమె తిమ్మాపల్లికి ఫోన్ చేసింది. అక్కడకు రాలేదని చెప్పడంతో బంధువులతో పాటుగా వెంకటేశ్‌ను అడిగినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్గవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సాయికుమార్ (ఫైల్)

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలుంటాయని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నవంబర్ 21న ఓ ఇంటిపై మరోవర్గం వారు కర్రలతో దాడి చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు మండల పరిధిలోని అంతారం గ్రామానికి చేరుకుని ఇరువర్గాల వారికి బహిరంగంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎటువంటి సమస్యలున్నా పోలీసులు, కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక పాల్పడడం సరికాదన్నారు. దాడులను ప్రోత్సహించే వారిపై సైతం కేసులు చేస్తామన్నారు. తరచూ గొడవపడే వారిపై పీడీ యాక్టు నమోద చేస్తామని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి, స్టేషన్ సిబ్బంది తదితరులున్నారు.

బాబోయ్.. బడి బస్సు!



డ్రైవర్ల ర్యాష్ డ్రైవింగ్‌తో విద్యార్థుల బెంబేలు

ఇటీవల తరచూ ప్రమాదాలు

- ప్రశ్నార్థకంగానే స్కూల్ బస్సుల సామర్థ్యం
- కొరవడిన ఆర్టీఏ అధికారుల నియంత్రణ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో బడి బస్సులు భయపెడుతున్నాయి. బస్సుల నిర్వహణలో పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం పిల్లలకు, వాహనదారులకు శాపంగా మారుతోంది. బడి బస్సుల డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్‌తో బెంబెలెత్తిస్తున్నారు. సోమవారం మేడ్చల్ సమీపంలో ఓ స్కూల్ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఉదంతం పిల్లలను, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. అదృష్టవశాత్తూ చిన్నారులు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల తరచూ ఎక్కడో ఒక చోట ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

నిర్లక్ష్య డ్రైవింగ్..

స్కూల్ బస్సులను నడిపేందుకు కనీసం అయిదేళ్ల అనుభవం కలిగిన వారినే డ్రైవర్లుగా నియమించాలి. కానీ.. అంతగా అనుభవం లేనివాళ్లను, అరకొర అవగాహనతో బస్సులను నడిపేవారిని ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో బీఎన్‌రెడ్డి నగర్, హబ్సీగూడ ప్రాంతాల్లో బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలిగొంది. ఈ రెండు చోట్ల బస్సు వెనక చక్రాల వద్ద ఆడుకుంటున్న పిల్లలను గమనించకుండా రివర్స్ చేయడం వల్ల పిల్లలు మృత్యువాత పడ్డారు. డ్రైవర్‌కు బస్సును అప్పగించే సమయంలోనే పాఠశాల యాజమాన్యం అతని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొంటే ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుంది. మరోవైపు పిల్లలను సకాలంలో స్కూళ్లకు చేరవేయాలనే ఒత్తిడి వల్ల కూడా కొందరు డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇరుకు రోడ్లపై ఇష్టారాజ్యంగా బస్సులు నడుపుతూ భయపెట్టిస్తున్నారు.

ప్రశ్నార్థకంగా బస్సుల సామర్థ్యం..

- సాధారణంగా ప్రతి ఏటా స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమయ్యే సమయానికి రవాణా అధికారులు వాటి సామర్థ్యాన్ని పరీక్షించాలి. పిల్లల కోసం బస్సులను వినియోగించేందుకు అవి అనుకూలంగా ఉన్నాయా? లేదా? అనేది ధ్రువీకరించాలి. ప్రతి సంవత్సరం సామర్థ్య పరీక్షలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది కూడా బడి బస్సులకు పరీక్షలు నిర్వహించారు. కానీ వాటి సామర్థ్యాన్ని కచ్చితంగా అంచనా వేయడంలోనే నిర్లక్ష్యం కనిపిస్తోంది. కొందరు అధికారులు బస్సులు ఎలా ఉన్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఇచ్చేస్తున్నారు.
- సామర్థ్య ధ్రువీకరణలో కచ్చితమైన ప్రమాణాలను పాటించడం లేదు. మరోవైపు సామర్థ్య పరీక్షలకు రాకుండా తిరిగే బస్సులపై దాడులు చేసి తగిన చర్యలు తీసుకోవడంలోనూ ఇదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో సుమారు 1,2000కు పైగా స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటిలో ఇంకా కొన్ని సామర్థ్య ధ్రువీకరణకు దూరంగానే ఉన్నట్లు సమాచారం. మొదట్లో 15 రోజుల పాటు తనిఖీలు నిర్వహించిన అధికారులు ఆ తర్వాత స్పెషల్ డ్రైవ్‌లను విస్మరించారు. పిల్లల భద్రత, రహదారి భద్రత దృష్ట్యా ఈ బస్సులపై నిరంతరం నిఘా ఉండాలి. కానీ రవాణా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ నిఘా లోపిస్తోంది.

పేరెంట్స్ కమిటీ పనితీరు..

- బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉండాలి. అవసరమైన ఫస్ట్ ఎయిడ్ మందులు, ఇతర పరికరాలు కూడా ఉండాలి. బస్సుల తనిఖీల సమయంలో మాత్రమే వీటిని ఏర్పాటు చేస్తున్నారు.
- బస్సుల నిర్వహణ, డ్రైవర్ పనితీరుపై పిల్లల తల్లిదండ్రులు కూడా ఓ కన్నేసి ఉంచడం మంచిది. ఎలాంటి సందేహాలు ఉన్నా స్కూల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం వల్ల ప్రమాదాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది.

డ్రైవర్ల ఎంపిక ఎంతో ముఖ్యం

- మోటారు వాహన చట్టం ప్రకారం స్కూల్ బస్సు డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించకుండా ఉండాలి. కానీ.. చాలా స్కూళ్లు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నాయి.
- పాఠశాల యాజమాన్యం ప్రతి డ్రైవర్ ఆరోగ్య పట్టికను విధిగా నిర్వహించాలి. ఇప్పటి వరకు అలాంటి పట్టికలు ఎక్కడా లేకపోవడం గమనార్హం.
- యాజమాన్యం తమ సొంత ఖర్చులతో డ్రైవర్‌కు 3 నెలలకోసారి రక్తపోటు, షుగర్, కంటి చూపు వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనే నిబంధన కూడా అమలుకు నోచుకోవడం లేదు.
- డ్రైవర్‌ను నియమించేందుకు ముందు అతని అర్హతలు, డ్రైవింగ్ లైసెన్స్ తతదితర అంశాలపై సంబంధిత ఆర్టీఏ అధికారులను సంప్రదించాలి. డ్రైవింగ్‌లో కనీసం 5 ఏళ్ల అనుభవం ఉండాలి. కానీ డ్రైవర్ ఎంపికలో విద్యాసంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు.
- ప్రతి స్కూల్ బస్సుకు డ్రైవర్‌తో పాటు అటెండర్ తప్పనిసరిగా ఉండాలి. పైగా వాళ్లు యూనిఫామ్ ధరించి ఉండాలి.

ఎస్‌ఎస్‌ఏలను క్రమబద్ధీకరించండి

- సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్
- నాల్గవరోజుకు చేరిన రిలే దీక్షలు

అనంతగిరి: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు మంగళవారం నాలుగో రోజుకు చేరాయి. ముందుగా అమర వీరుల స్థూపానికి నివాళి అర్పించిన ఉద్యోగులు ర్యాలీగా వెళ్లి వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా గాంగ్యానాయక్ మాట్లాడుతూ.. తమను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా నేటికీ నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ హాజరై సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీశైలం, ప్రభావతి, స్రవంతి, రాజేశ్వరి, రాధిక, పల్లవి, ఆశలతా, రాగిణి, రఘు, సర్వర్, కృష్ణ, దశరథ్, రఘుసింగ్, జంగయ్య, రాఘవేందర్, నాగయ్య సమగ్ర శిక్షా అభియాన్‌లోని పలు విభాగాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

ప్రజలకు అందుబాటులో వైద్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: ప్రజలకు అందుబాటులో వైద్య సేవలను ఉంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పల్లె దవాఖానాలను అందుబాటులోకి తీసుకువస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని పులుమామిడిలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి. ఎంపీడీఓ అనురాధ, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రసన్న, వైద్యాధికారి రోహిత్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, సెక్రెటరీ భానుప్రసాద్, ఏఎన్ఎం శంకరమ్మ, అంగన్వాడీ టీచర్స్ సంపత్ కుమారి, పద్మ, నాయకులు నాగిరెడ్డి, భీంరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బుచ్చి రెడ్డి, ఇబ్రహీం, శ్రీనివాస్, విఠల్‌రెరెడ్డి, జానీ, రాములు, గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మురళి, చంద్రయ్య, రామచంద్రయ్య, మల్లేశం గ్రామస్తులు పాల్గొన్నారు.



పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మరుగుదొడ్లను వినియోగించుకోవాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో మాట్లాడారు. వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా గత నెల 14 నుంచి ఈనెల 10 వరకు జిల్లాలోని గ్రామపంచాయతీలో రోజువారీ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మరుగుదొడ్ల ఉపయోగం, వినియోగంపై అవగాహన సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు ప్రణాళికలు తయారు చేశారని చెప్పారు. అనంతరం నిత్యం మరుగుదొడ్లను వినియోగించే పలువురిని సత్కరించారు. వికారాబాద్ జిల్లాను ఉత్తమ స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లాగా రూపొందించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.